క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురంలో జరిగిన రోడ్డు ఒక వ్యక్తి తీవ్రగా గాయవడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాకినాడ – పిఠాపురంలో రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో చోడిశెట్టి పద్మరాజు తన మేనమామతో కలిసి మోటారు సైకిల్‌పై పిఠాపురం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పిఠాపురం వైపు కొబ్బరి కాయల లోడుతో అతివేగంగా వెళ్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పద్మరాజు తలకు, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో సమీపంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్చారు. వెంటిలేటర్‌పై వైద్యం పొందుతున్నట్టు పోలీసులు తెలిపారు. పద్మరాజు భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు తిమ్మాపురం ఎస్సై మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పద్మరాజుకు భార్య, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో పాటు ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు.

బర్డ్ ఫీడర్ల పంపిణీ



లయన్స్‌క్లబ్ సభ్యులకు బర్డ్ ఫీడర్లను పంపిణీ చేస్తున్న బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: పర్యావరణ సమతుల్యతకు జీవ వైవిధ్యం ఎంతో అవసరమని లయన్స్‌క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు. స్థానిక కుళాయిచెరువు పార్కులో గురువారం క్లబ్ రీజనల్ చైర్మన్ పద్మతులసి ఆధ్వర్యంలో బర్డ్ ఫీడర్లను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ఆమె తీసుకుంటున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం క్లబ్ సభ్యులకు బర్డ్ ఫీడర్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ, క్లబ్ వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, జోన్ చైర్మన్ గరికిపర్తి నమఃశివాయం, సభ్యులు పాల్గొన్నారు.

దంత సంరక్షణ ఎంతో అవసరం



విద్యార్థులకు పేస్టులు పంపిణీ చేస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: విద్యార్థి దశ నుంచి దంత సంరక్షణ ఎంతో అవసరమని రోటరీ గోల్డెన్ జుబ్లీక్లబ్ మాజీ అధ్యక్షుడు టీవీ బాలకృష్ణ అన్నారు. స్థానిక ప్రతాప్‌నగర్ మున్సిపల్ స్కూల్‌లో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జేజే దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న వయసులో దంతాలు సంరక్షించుకొంటే పెద్ద అయిన తర్వాత సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. అనంతరం దంత వైద్యులు నంద కిశోర్, భువనేశ్వరి, స్వరూప ఆధ్వర్యంలో 175 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి, వారికి ఉచితంగా టూత్ బ్రష్‌లు, పేస్టులు, మౌత్ వాష్‌లు అందించారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి



బచ్చు శేఖర్‌ను సత్కరిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: కాకినాడ వ్యవసాయమార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన బచ్చు శేఖర్ అన్నారు. స్థానిక పీఆర్ కళాశాల్లో గురువారం పీఆర్ కళాశాల గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతులకు, వినియోగదారులకు మంచి సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్ కళాశాల గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పంపన సాయి పాల్గొన్నారు.

పేదలకు గృహాలు నిర్మించాలి

బాలాజీచెరువు: నగరంలో ఉన్న పేదలకు సొంత ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని, వారందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటూ సామాజిక వేత్త పెదిరెడ్డి రాజేష్ నగర ఏమ్మెల్యే వనమాడి వేంకటేశ్వరరావును కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఏమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హయాంలో వేలాది మందికి పట్టాలు పంపిణీ చేశారని, పట్టాలు పొందిన వారందరికీ గృహాలు మంజూరుచేసి వారిని ఆదుకోవాలని కోరారు.

బెల్లపు ఊట ధ్వంసం

కాకినాడ క్రైం: కాకినాడ ఉత్తర ఎక్సైజ్ శాఖ నిర్వహించిన దాడుల్లో నాటుసారాను స్వాధీనం చేసుకొని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట–పిఠాపురం రోడ్డులో గురువారం ఈ దాడులు నిర్వహించామని ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టామని ప్రకటనలో పేర్కొన్నారు.

సెల్‌వుల్లో గేమ్స్ వద్దు!



- కంటి చూపునకు ముప్పంటున్న పెద్దలు
- అవగాహన లేకుంటే జీవితం అంధకారం
- తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలి
- అవుట్‌డోర్ గేమ్స్‌తో శారీరక, మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయంటున్న నిపుణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాలలకు దాదాపు సెలవులు ప్రకటించే సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సీబీఎస్ఈ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు సెలవులు ఇవ్వడంతో సెల్ గేమ్స్‌కు పరిమితం అవుతున్నారు. ఆధునిక ప్రపంచంలో సెల్‌ఫోన్ ప్రాధాన్యం పెరిగినా చిన్నారుల్లో దాని అతి వినియోగం వల్ల కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిలో ప్రధానం కంటి సమస్యలు. ఈ విషయంలో తల్లిదండ్రులు సైతం బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉంది. వారి కాళ్లకు అడ్డం పడకుండా, ఏదో ఒకదానికి వేధించకుండా కుదురుగా ఉంచడానికి ఆ చిన్నారులకు సెల్‌ఫోన్ ఇచ్చేసి ఓ మూల కూర్చోబెడుతున్నారు. కానీ పిల్లల్లో సెల్ ఫోన్ వినియోగం వల్ల వారి కంటిపై పడే ఒత్తిడి వల్ల చిన్న వయసులో వారు కంటి సమస్యల బారిన పడుతున్నారనే విషయం మరచిపోతున్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఎందుకంటే మనమంతా ప్రపంచాన్ని చూసే కిటికీ కన్ను. కంటి సమస్యలు విద్యార్థుల్లో సరైన సమయంలో గుర్తించి తగిన చికిత్సను అందిస్తే పెద్ద సమస్యల నుంచి కాపాడిన వారుమవుతాం.

పిల్లల్లో కంటి సమస్యలు గుర్తించండి ఇలా....

- టీవీ చాలా దగ్గరగా కూర్చుని చూడడం
- పాఠశాలల్లో పక్కన ఉన్న పిల్లల పుస్తకాలు చూసి రాయడం
- చదివేటప్పుడు తల ఒక వైపు తిప్పి, ఒక కంటితో చదవడం
- కళ్లు అస్తమాను చిన్నవి చేయడం
- కళ్లు తరచూ రెప్పలు వేయడం
- తలనొప్పి, తల తిరడగం, ముఖంలో చిరాకు, పుస్తకాలు ముఖానికి దగ్గరగా పెట్టుకుని చదవడం

కంటి సంరక్షణకు ఆహారం...

విటమిన్ ఎ, సి, ఇ ఉండే ఆహారం తీసుకోవాలి. ఒమెగా ఫ్యాటి యాసిడ్స్, క్యారెట్, గోంగూర, విటమిన్ ఎ కలిగిన చేపలు, ఎక్కువగా తీసుకోవాలి. సూర్యకాంతిలో రోజుకు ఒక గంట ఆడించడం చాలా అవసరం. దాని వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉండి అన్ని విధాలా వృద్ధి చెందుతారు.



విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



సెల్‌ఫోన్‌తో పిల్లల కాలక్షేపం..

అందుబాటులో ఆధునిక చికిత్స



తల్లిదండ్రులు తమ పిల్లలకు కనీసం ఏడాదికి ఒకసారైన కంటి పరీక్షలు చేయించాలి. మూడేళ్ల వయసు నుంచే పరీక్షలు చేయించడం ఉత్తమం. పిల్లల్లో కంటి సమస్యలు గుర్తిస్తే వెంటనే కంటి వైద్యుని సంప్రదించాలి. ఆధునిక చికిత్స విధానంలో విద్యార్థులు, చిన్నారుల్లో సమస్య పెద్దది కాకుండా నిరోధించవచ్చు. అంబయ్యోపియాను గుర్తించి చికిత్స చేయకపోతే అది శాశ్వతంగా చూపు కోల్పోవడానికి దారి తీస్తుంది. దీనికి 14 ఏళ్ల లోపు చికిత్స అందించాలి. సాధ్యమైనంత వరకు పిల్లల్లో సెల్ ఫోన్ వినియోగం తగ్గించడం ఉత్తమం.

– ఎండి నవీదుల్ హుస్సేన్, ఆప్టోమెట్రిస్ట్

కంటిపై సెల్ ఫోన్ ప్రభావం...

సెల్ వినియోగం అతిగా ఉండడం వల్ల కళ్లు డ్రైగా మారతాయి. మైనస్ పవర్ పెరిగే అవకాశం ఎక్కువ. చీకటి గదుల్లో సెల్ ఫోన్ చూడడం వల్ల కంటిపై ఒత్తిడి పెరిగి ఎదిగే పిల్లల్లో కంటి సమస్యలు రోజురోజుకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.



వీడియో గేమ్ ఆడుతున్న విద్యార్థి



కళ్లు దెబ్బతినేలా..

పిల్లల్లో వచ్చే కంటి సమస్యలు...

మయోపియా: మయోపియా అంటే దూరపు చూపు మందగించడం. ప్రస్తుత కాలంలో 14 సంవత్సరాల లోపు పిల్లల్లో ఈ మయోపియా సమస్య ఎక్కువైందని కంటి వైద్యులు చెబుతున్నారు.

హైపర్ మెట్రోపియా: దీనినే దగ్గర చూపు మందగించడం అంటారు. ఇది పిల్లల్లో ఎక్కువగా కనిపించదు.

యాంబ్లియోపియా: ఒక కన్ను సరిగా ఉండి మరో కన్ను అభివృద్ధి చెందక పోవడం.



మెల్ల కన్ను (స్ట్రాబిస్‌మస్)తో ఉన్న చిన్నారి

స్ట్రాబిస్‌మస్: దీనినే మెల్లకన్ను అంటారు. రెండు కళ్ల మధ్య సరియైన సమన్వయం లేకపోవడంతో ఈ సమస్య వస్తుంది.

అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు

కాకినాడ సిటీ: ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాం**కుల ఫిల్లింగ్‌కు అవసరమైన కార్యాచరణ,** తాగునీటి **సరఫరా, ఎంఎస్ఎమ్ఈల సర్వే స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో** కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం అమరావతి సచివాలయం సీఎస్ కాన్ఫరెన్స్ హాలు నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి వి. రవికుమార్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ జి ప్రసాద్ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో మహిళకు 18 నెలల జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకి 18 నెలల జైలు, రూ.15 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మి కుమారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన పాటంశెట్టి సతీష్ వద్ద నుంచి కాకినాడ చెందిన యరమాటి అనురాధ 2019లో రూ.12 లక్షల అప్పు తీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2021లో రూ.15 లక్షలకు చెక్కు ఇచ్చారు. చెక్కును సతీష్ బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో యరమాటి అనురాధపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

- జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- ఉత్సాహంగా జేఎన్‌టీయూకే వార్షికోత్సవం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రీడల ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుందని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాల సందర్భంగా గురువారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే వారి సంఖ్యను చూసి భయపడుతున్నారని, ఉన్న ఉద్యోగాల్లో మనకు కావలసింది ఒకటేనని గుర్తుంచుకుని విజయం సాధించాలన్నారు. క్రీడలు, సంగీతం నేర్చుకున్నట్లయితే మన నడవడిక, వైఖరి, సానుకూల ధోరణి వైపు మారుతుందని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరిలో ఏదో ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభకు కృషి తోడైయితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. మరో ముఖ్య అతిథి భారత్ బీచ్ వాలీబాల్ కెప్టెన్ ఎంసీహెచ్ఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనే విద్యార్థులకు క్రెడిట్ పాయింట్స్ ఇస్తున్న యూనివర్సిటీ జేఎన్‌టీయూకే ఒకటేనన్నారు. ఈ విధానాన్ని అన్ని వర్సిటీలు అవలంబించాలని కోరారు. స్పోర్ట్స్ కోటాలో 3 శాతం రిజర్వేషన్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం చాలా సులభమన్నారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు, ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ప్రధానమన్నారు. కార్యక్రమానికి ముందుగా స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి 2024–25 వార్షిక క్రీడా నివేదికను వివరించారు. అనంతరం జేఎన్‌టీయూకే తరపున రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, దీక్షితులు పాల్గొన్నారు.

దళారుల దోపిడీ అరికట్టాలి

పెద్దాపురం: వరి రైతుకు గిట్టుబాట ,ధర కల్పించి దళారుల దోపిడీని అరికట్టాలని ఏపీ రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజుబాబు, బి.రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరు గ్రామంలో గురువారం రైతులకు మద్దతుగా ప్రత్తిపాడు–సామర్లకోట రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్బీకేలలో సత్వరమే సీఎంఆర్ ఓపెన్ చేసి దళారి వ్యవస్థను కట్టడి చేయాలన్నారు. జిల్లా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయంటున్నారే తప్ప అవి దళారులకు కొమ్ము కాస్తున్నాయన్నారు. సత్వరమే రైతుకు గిట్టుబాటు ధర కల్పించి దళారుల దోపిడీని అరికట్టాలని, లేని పక్షంలో ఆందోళన మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కడితి సతీష్, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మడికి సత్యం, కర్నాకుల రామలింగేశ్వరరావు, సత్తిబాబు, బీడీల నాగేశ్వరరావు, వర్దనపు శివాజీ, దాకే నాగరాజు, దాకే సులేమాన్, కొండపూడి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ప్లాన్ల కోసం దరఖాస్తు చేసుకోండి



గుర్తింపు పొందిన జాబితాను విడుదల చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు

సామర్లకోట: మున్సిపల్ ఆదాయం పెంచుకునే క్రమంలో గతంలో గుర్తించిన ఇంటి నిర్మాణాలకు ప్లాన్లకు అనుమతి ఇవ్వనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. ఈ మేరకు పట్టణంలో 4, 6, 22, 23 వార్డులను గుర్తించినట్టు తెలిపారు. గురువారం ఆయా వార్డులలో గతంలో దరఖాస్తు చేసుకోగా అనుమతి నిరాకరించిన నిర్మాణాల వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తున్నామని, వాటిపై అభ్యంతరాలు ఉంటే వారం రోజులో తెలియ జేయాలన్నారు. ఆయా లే అవుట్లలో మున్సిపాలిటీ నిబంధనల మేరకు ఉండాల్సిన రోడ్లు లేకపోయినా, మెయిన్ రోడ్డుకు దూరంగా మారుమూల ఉన్న ప్రాంతాలలో కనీసం 12 నుంచి 20 అడుగుల రోడ్లు ఉన్నప్పటికీ ప్లాన్లకు అనుమతి ఇవ్వనున్నట్టు కమిషనర్ తెలిపారు. అనధికార లే అవుట్లలో నిబంధనల ప్రకారం రోడ్లు లేకపోవడంతో మున్సిపాలిటీ ప్లాన్లు ఇవ్వడం లేదన్నారు. దాంతో స్థలాలను కొనుగోలు చేసిన వారు స్థలాలను ఖాళీగా వదిలేస్తున్నారని, దాంతో మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోందన్నారు. మున్సిపల్ ఆదాయం పెంచే క్రమంలో ఇరుకు రోడ్లు ఉన్న ప్రాంతాల్లో ప్లాన్లు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ సర్క్యులేషన్ ప్యాట్రన్స్ జీఓను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే ప్రధాన రోడ్లలో ఉన్న లే అవుట్‌లో మాత్రం నిబంధనల ప్రకారం రోడ్లు ఉండాలన్నారు. అవసరమైతే రోడ్డు వెడల్పు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి మంజుల, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ప్రమాదాలపై అవగాహన

కాకినాడ క్రైం: కాకినాడలో అగ్నిమాపక వారోత్సవాలు విజ్ఞానభరితంగా జరగుతున్నాయి. డీఎఫ్‌వో పీవీ సాయి రాజేష్ పర్యవేక్షణలో ఏడీఎఫ్‌వో ఉద్దండరావు సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రుల్లో జరిగే ప్రమాదాలు, వాటి నుంచి బయటపడే మార్గాలపై అవగాహన ప్రదర్శన జరిగింది. కాకినాడ పోర్టు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రిలో సాలిపేట ఫైర్ స్టేషన్ బృందం ఈ అవగాహన చేపట్టింది. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు, అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రోగులు, వారి బంధువులను ఎలా తప్పించాలో తమని తాము ఎలా రక్షించుకోవాలో సిబ్బందికి తెలియజెప్పారు. భవనం పై అంతస్తుల్లో చిక్కుకున్న సామాన్యులు, రోగులను రక్షించి సురక్షితంగా కిందికి చేర్చే మెళకువలపై అవగాహన కల్పించారు. అప్పటికే చికిత్సలో ఉన్న లేదా ఐసీయూలలో వైద్యం పొందుతున్న అపస్మారక స్థితిలో ఉన్న రోగులను క్షేమంగా తరలించే ప్రక్రియలను ప్రదర్శించారు. లీడింగ్ ఫైర్ మెన్‌లు ఎం.చక్రపాణి, జీఎస్ఆర్‌కే రెడ్డి, ఎం.రాంబాబు, ఎస్‌కే సంధాని, ఎస్‌కె దొర, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అపస్మారక స్థితిలో ఉన్న రోగిని తరలించే విధానాన్ని వివరిస్తున్న ఫైర్‌మెన్

స్ఫూర్తిదాయకురాలు అహల్యాబాయి



పద్మావతిని సత్కరిస్తున్న బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ

బోట్‌క్లబ్: జీవితంలో ప్రతి దశలోను ఎదురైన కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ సమర్థపాలన, హిందూ ధర్మపరిరక్షణ సాగించిన అహల్యాబాయి హూల్కర్ అభినందనీయురాలని మహిళా సమన్వయ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఐ.పద్మావతి పేర్కొన్నారు. స్థానిక పైండా చలమయ్య ఫంక్షన్‌హాల్‌లో గురువారం అహల్యాబాయి హూల్కర్ జయంతిని నిర్వహించారు. మహిళలు హూల్కర్ వంటి వారి జీవితాలు నుంచి ప్రేరణ పొంది తమలోని శక్తి సామర్థ్యాలను తెలుసుకోవాలన్నారు. తాము మరికొంతమందికి ప్రేరణ ఇవ్వాలన్నారు. ఆర్ఎస్ఎస్ దక్షణభారత ప్రచార్ భరత్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి వ్యక్తి ప్రధానం కాదని కుటుంబం ప్రధానమైనదన్నారు. అటువంటి గొప్ప వ్యవస్థను పాశ్చాత్య ప్రభావాల నుంచి పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బీజేపీ నాయకురాలు తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో పద్మావతిని సత్కరించారు. కార్యక్రమంలో వి.భారతి, కమల పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు

- ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీ రాజకుమారి
- 3వ బెటాలియన్‌లో ముగిసిన రేంజ్ – 1 స్పోర్ట్స్
- విజేతలకు బహుమతి ప్రదానం



క్రికెట్‌లో విజేతగా నిలిచిన మూడో బెటాలియన్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఐజీ రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప, నాగేంద్రరావు

కాకినాడ రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీ బి.రాజకుమారి పేర్కొన్నారు. రమణయ్యపేటలోని కాకినాడ 3వ బెటాలియన్‌లో మూడు రోజులు పాటు జరిగిన రేంజ్ – 1 పరిధిలోని స్పోర్ట్స్ గురువారంతో ముగిశాయి. రేంజ్ – 1 పరిధిలోని విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, మంగళగిరి బెటాలియన్లకు చెందిన ఏపీఎస్పీ క్రీడాకారులు విజయం కోసం పోటీ పడ్డారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మూడు రోజుల పాటు పరుగు పందెం పోటీలు, కబడ్డీ, క్రికెట్, చెస్, వాలీబాల్, లాంగ్‌జంప్, హై జంప్, తదితర పోటీలను కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు పర్యవేక్షణలో సమర్థవంతంగా నిర్వహించారు. చివరిలో టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. ముఖ్య అతిథులు ఐజీ రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప క్రీడలు ముగిసిన అనంతరం గౌరవవందనం స్వీకరించారు. పోటీలలో విజేతలకు ఐజీ రాజకుమారి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా రాత్రి పది గంటల వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అతిథులు వాటిని ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఐజీ రాజకుమారి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి, బుద్ధి వికసనకు దోహదపడతాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడల ద్వారా మంచి సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయన్నారు. 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు మాట్లాడుతూ తమ బెటాలియన్‌కు క్రీడా పోటీలు నిర్వహించే అవకాశం కల్పించడం అభినందనీయమని, సమర్థవంతంగా నిర్వహించగలిగామని ఇందుకు సహకరించిన ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో 4, 6 బెటాలియన్ల కమాండెంట్లు రామకృష్ణ, దీప్తి, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, మన్మధరావు, ఆర్ఐలు అజయ్‌కుమార్, రవిశంకర్‌రావు, వితలేశ్వరరావు, ప్రసాద్, ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ముగింపు అనంతరం విందు ఏర్పాటు చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నాట్యం చేస్తున్న కళాకారిణి



పరుగు పందెంలో వివిధ విభాగాల్లో విజేతలు



టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతూ..



విజయం కోసం పరిగెడుతూ..